స్కెచ్

# పరువు బరువు

"హితశ్రీ"

"నిరంజనరావుగారూ,"

టైపు చేస్తున్న నిరంజనరావు తలెత్తి, వీధి వైపు తలుపుదగ్గర నిలబడ్డ వ్యక్తిని చూసి "రావొచ్చు" అన్నట్టుగా తల ఆడించాడు. అతను లోపలికి వచ్చి నిరంజనరావుకి మూడు అయిదు రూపాయల నోట్లు ఇస్తూ అన్నాడు,

"మొదటి నెల అడ్వాన్సు. తారీఖు జ్ఞాపకం ఉంచుకోండి. మొన్న ప్రవేశించాను."

నిరంజనరావు కృతజ్ఞతా పూర్వకంగా చిరునవ్వు నవ్వి, తనకు వినబడేట్టు మాత్రమే "థ్యాంక్స్" అని, ఆ నోట్లు టైపురైటర్ కిందికి తోస్తూ, సెలవు తీసుకుంటున్న ఆ వ్యక్తి వైపు చూడకుండానే చెయ్యి సగంవరకూ అభివాదన అందుకుంటున్నట్టుగా ఎత్తి మళ్ళీ కీబోర్డుమీద వేశాడు.

నిరంజనరావుని పత్రికా రచయిత అనొచ్చు. అప్పుడప్పుడు తనకి తోచిన విషయాలమీద ఇంగ్లీషులో వ్యాసాలు రాసి పత్రికలకి పంపుతూంటాడు. సహాయ నిరాకరణోద్యమంలో ఉద్యోగానికి స్వస్తి చెప్పి, ఉత్సాహం ఉన్నంతవరకు దేశసేవ చేశాననిపించుకుని, తరవాత దానికికూడా తిలోదకాలిచ్చి, వారసులు లేని ఆస్తిని తన జీవితకాలంలో సాధ్యమైనంతవరకు పూర్తి చెయ్యాదలుచుకున్నాడు. పూర్వం చేసిన దేశసేవకి మధుర స్మృతిగా ఇప్పుడు ఖద్దరు వస్త్రాలు ధరించటం మాత్రం మిగిలింది. నలభయ్యో పడిలోని వ్యక్తిని చూసి ఒకనాటి సైనికుడిగా జనం గౌరవిస్తూండటంవల్ల జీవితంలో ఇహ కావలసిందీ, చెయ్యవలసిందీ ఏమీ లేదనీ, సంపాదించుకున్న పరపతి జీవితాంతంవరకు అయిపోదని అంచనా వేసుకునీ, నిరాక్షేపణీయంగా బతక దలుచుకున్నాడు అతను.

ఇటువంటి స్థితిగతులు గల నిరంజనరావు తన డాబామీది ఒకే ఒక్క గదినీ, అద్దెకిచ్చెయ్యటం ఎందుకో అని తెలియనివారికి ఆశ్చర్యం కలగటం సహజం. ఊళ్ళో రెండు సంవత్సరాల కిందట స్థాపించిన కాలేజీ ఆ సంవత్సరం ఫస్టు గ్రేడు కాలేజీ కావటంవల్ల సంభవించిన గృహ కొటకం చేతనైనంతవరకు తీర్చటం తనవంటి దేశసేవకుడి కనీస ధర్మమని అతను అభిప్రాయ పడ్డాడు. అంచేత మేడ గది అద్దెకివ్వబడ్డది.

టైపుచేసిన కాగితాలు తీసేసి, టైపురైటర్ మూత వెయ్యటానికి వెనక్కి తిరిగి, అప్పుడే లోపలికి వస్తున్న ఓ పెద్ద మనిషిని చూసి, చెయ్యదలుచుకున్న పనిని ఆపి, "రండి" అన్నాడు నిరంజనరావు. ఆ పెద్ద మనిషి ఓ నమస్కార బాణం పారేసి, అక్కడగల ఓ కుర్చీలో కూర్చున్నాడు.

"ఊరికే రారు మహాత్ములు" అన్నాడు నిరంజనరావు.

దేశసేవలోకి ఉరికిన అతనికి, తనకంటె ఎంత తక్కువ అంతస్థులో ఉన్న మనిషితోనయినా ఎంతో గౌరవంగా, నమ్రతగా మాట్లాడటం అలవడింది.

"ఎంతమాట! తమదర్శనమే మహాభాగ్యం"

"పెద్దలు, అలా అనకండి."

"ఏం పెద్దరికం? ఎంతసేపటికీ మా పొట్ట మేం పోసుకోటానికి తాపత్రయ పడటమే గాని, మీలా సంఘసేవ, దేశసేవ చెయ్యగలమా ఏమన్నానా?"

"దాండేముంది లెండి, ఎవరి శక్త్యానుసారం వాళ్లు చేస్తుంటారు."

"చల్లకి వొచ్చి ముంత దాచటం ఎందుకు? ఓ చిన్న అర్జీ ఉందండీ."

"ఏమిటి?" బహుశా, ఈ కొత్తమనిషి ఏదో రికమెండేషన్ కి వొచ్చి ఉంటాడనుకున్నాడు నిరంజనరావు

"గవర్నమెంటుకి ఓ చిన్న అర్జీ పెట్టు

కున్నాను. లైసెన్సు గొడవలేండి. దయచేసి తమరు కాస్త టైపు చేయించి పెడితే..."

"ఇంతేగద. అలాగే. ఇటు తెండి." ఉదారంగా అన్నాడు నిరంజనరావు, సిఫారసు ప్రసక్తి రానందుకు సంతోషిస్తూ.

టైపు చేస్తుండగా, ఆ పెద్దమనిషి నెమ్మదిగా అన్నాడు, "ఏదో తమలాంటి వాళ్లిలా ఉచితంగా మాలాంటి బీదవాళ్ళకి సహాయం చేస్తుండబట్టి ఈ మాత్రం బతకగలుగుతున్నాము..."

నిరంజనరావు జవాబుగా చిరునవ్వు నవ్వాడు.

"చూడండీ, మా అబ్బాయి స్కూల్ ఫైనల్ పరీక్షకి వెళ్ళాడు. మరి రేపటినించీ పంపమని సెలవా?"

"ఎందుకు?" అన్నాడు నిరంజనరావు ఆశ్చర్యంగా.

"ఊరికే ఉంటే ఏం లాభం? కాస్త టైపు నేర్చుకుంటే ఎందుకైనా మంచిదని అంటున్నాడు. పనిమీద ఇలా పోతుంటే, ఇదివరకే విని వున్న తమ ఉదారస్వభావం, కళ్ళారా చూసి అడుగుతున్నాను."

"నేర్చుకోటానికా?"

"మరేనండి."

నిరంజనరావుకి ఏమనటానికి తోచలేదు. తన ఉదార స్వభావాన్ని అంతగా పొగడుతున్న ఆ వ్యక్తికి ఆశాభంగం కలిగించటం సముచితం కాదనిపించింది అతనికి. అయినా అన్నాడు,

"దానికేంగాని, టైం ఉండదేమోనని..." నసిగాడు.

"తమరలా అంటే కాదు. బహుశా ఇప్పటికే ఖాళీలేక పోవొచ్చు. కాని తమరు తలుచుకుంటే—"

"పోనీలే పాపం" అనుకున్నాడు నిరంజనరావు.

"తమ దయ" అన్నాడు అతను మళ్ళీ.

"సరే, పంపండి."

ఆ వ్యక్తి కృతజ్ఞతా పూర్వకంగా, అనేక ప్రశంసలు చేసి, టైపు చెయ్యబడ్డ అర్జీ తీసుకొని సెలవు తీసుకున్నాడు.

నిరంజనరావు తీరిగ్గా కిటికీలోంచి వీధిలోకి చూడసాగాడు. బజారుకి సమానాంతరంగా ఉండటంవల్ల ఆ వీధిలో కళకలం కొంచెం ఎక్కువగానే ఉంటుంది. పని లేనప్పుడలా వీధిలోకి చూస్తూండటం అతని కలవాటు.

సంశయిస్తూ వీధి గుమ్మం దగ్గర నిలబడ్డ వ్యక్తిని చూసి "ఏం కావాలి?" అన్నాడు నిరంజనరావు.

"నాకు చదువుకోవాలని వుందండీ" అన్నాడతను.

సుమారు ఇరవై ఏళ్ళ వ్యక్తి ఆ మాట అనేసరికి నిరంజనరావులోని దేశభక్తికి కొంచెం కదలిక కలిగింది. ఆ వ్యక్తి చాలా బీదదుస్తుల్లో ఉన్నాడు. చదువు ఎక్కువగా వచ్చి ఉండదని అతని వాలకమే చెబుతోంది.

"ఇదివరకేమైనా చదువుకున్నావా?" తెలుసుకుందామనే అభిలాష అతనికి తెలియకుండానే ఈ ప్రశ్న అడిగించింది.

"నాలుగో క్లాసు దాకా చదివానండి."

"అలాగా?" అన్నాడు నిరంజనరావు. వయోజన విద్యను గురించి అతను రాసిన వ్యాసం వెంటనే జ్ఞప్తికి వచ్చింది.

"నాలుగో క్లాసు కాగానే డబ్బు లేక మానేశాను. ఎవరన్నా పుస్తకం చదవటం చూసినప్పుడల్లా గుబులుగా ఉంటుంది."

తల నిలువుగా సానుభూతి పూర్వకంగా ఆడించాడు నిరంజనరావు.

"తమరి దయవుంటే చదువుకుంటాను."

ఏమైనా సహాయం కావాలి కాబోలు అనుకున్నాడు అతను.

"ఏం కావాలి?"

ఆ వ్యక్తి అర్థం కానట్టుగా నిరంజనరావు వైపు చూశాడు.

"ఏమైనా డబ్బు కావాలా?"

"తమరు చదువు చెబుతారని..."

"నేనా?" అన్నాడు నిరంజనరావు ఆశ్చర్యంగా.

"చిత్తం. డబ్బు తీసుకోకుండా తమరు రాత్రి పూట చెబుతారని..." సంకోచించాడతను.

నిరంజనరావు ఒక క్షణం ఆలోచించాడు.

తన కొక్కడ తీరుతుంది. ఎన్నో వ్యాపకాలు. ఆ ఓపికే ఉంటే రాత్రి బడి పెట్టేవాడు కదూ!

"ఇప్పటికే నాకు తీరటం లేదోయ్."

"తమ దయ."

అతన్ని చూస్తే నిరంజనరావుకి జాలేసింది. ఏమనటానికీ తోచలేదు. అసలు ఇతను తన దగ్గిర కెందుకొచ్చాడో తనకి తెలియలేదు. అలా అతను తనను యాచించటంలో ఒకవిధమైన స్వాతిశయం నిరంజనరావుకి కలిగింది. తనకి ఒక విశిష్టస్థానం, గౌరవం ఏర్పడ్డట్టుగా అనుకున్నాడు.

"సరే లే."

ఆ వ్యక్తి సంతోషంతో "ఎప్పటినించి రమ్మంటారు బాబూ?" అన్నాడు.

"నీ ఇష్టం."

"రేపటినించి రానా?"

"ఊఁ" అన్నాడు నిరంజనరావు. అతను కృతజ్ఞతతో నమస్కరించి వెళ్లిపోయాడు.

తన ఖ్యాతినిగురించి ఒక నిమిషం తలుచుకొన్నాడు నిరంజనరావు. అంతకంటె ఎక్కువసేపు తననిగురించి ఆలోచించుకోటానికి అతనికి అవకాశం చిక్కలేదు. ఎవరో ఒకాయన లోపలికి ప్రవేశిస్తూ నమస్కరించాడు. ఆ కొత్తమనిషివైపు కొంచెం విసుగ్గా చూసి, "రండి" అన్నాడు నిరంజనరావు. అతను తాపీగా కూచుని సూటిగా వొచ్చిన పని బయటపెట్టాడు.

"మూడురోజుల్నించి ఒకటే రొంప, భారం, క్షణం తీరికలేకుండా దగ్గూ, నానాబాధగా ఉందండీ."

నిరంజనరావు అతని వైపు ఆశ్చర్యంగా చూశాడు. బహుశా అయన్ని తను మర్చిపోయి ఉంటాడేమో ననుకుని జ్ఞాపకం తెచ్చుకోటానికి ప్రయత్నించాడు. కాని ఎక్కడా ఆచోకీ దొరకలేదు. అయినా తనెవరో ఆయన్ని అడిగితే ఏం బావుంటుంది?

"నాకు హోమియో అంటే మొదటినించీ మహోగురండీ. ఇంత మహాపట్నంలో సరిగా ఆ మాత్ర లిచ్చేవాళ్ళే లేరు. తమరు హోమియో బాగా చదివారనుకుంటాను."

"ఏదో చదివానండి" అయోమయావస్థలో పడ్డాడు నిరంజనరావు. ఈవ్యక్తి ఎవరో తన్ని బాగా ఎరిగున్నట్టు మాట్లాడుతున్నాడు. తనకి హోమియో వైద్యం వొచ్చనికూడా అతనికి తెలుసు. ఇది కేవలం ఆంతరంగిక విషయం. పరాయివాళ్ళకి తను ఇంతవరకూ ఒక్క మాత్ర కూడా ఇవ్వలేదు. ఏదో ఇంట్లో వాడటంకోసం చదివాడు. ఆ సంగతి ఈయనెలా తెలుసుకున్నాడో!

"ఏదో మీచేతి చలవవల్ల ఇది తగ్గితే ఫీడా వొదుల్తుంది. తిండీ, తిప్పలూ లేవు. యాతనగా ఉంది."

"అలాగేలెండి, దానికేం!" అని నిరంజనరావు డ్రాయర్ తెరిచి కొన్నిమాత్రలు పొట్లం కట్టి ఇచ్చాడు. ఆ వ్యక్తి అవి అందుకొని అన్నాడు,

"తమరు దీర్ఘవ్యాధులు కూడా నయం చెయ్యగలరనుకుంటాను."

"ఆఁ అంత అనుభవం లేదండి."

"అలా అంటారేమండి, ఎన్ని కదిలించినా ఈ రోజుల్లో కోతలుకోసి పారేస్తుంటే. సొంతబడాయి చెప్పుకోని వాళ్లెవరో మహానుభావులు మీలాంటి వాళ్లు. మళ్ళీ తమ దర్శనం చేసుకొంటానండి. అప్పుడంతా వివరంగా చెబుతాను. తమలాంటి ధర్మదాతలుండబట్టి దేశం ఈ మాత్రంగా నయినా ఉంది. డబ్బిచ్చి వైద్యం చేయించుకోలేని మాలాంటి బీదవాళ్లకి తమరే దిక్కు. సెలవు."

అనర్గళమైన ఈ ఉపన్యాసాన్ని విని, ఉక్కిరి బిక్కిరై నిరంజనరావు ఆ వ్యక్తి నామాతృరాల్ని స్మృతిలోకి తెచ్చుకోటంకోసం తల పగలగొట్టుకుంటున్నవాడు, ఆ ఆలోచన మానేసి తన హోమియో వైద్య నైపుణ్యాన్ని తనలో తను ప్రశంసించుకోసాగాడు.

అతని ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ సుబ్బారావు లోపలికి నిరాఘాటంగా బూట్ల టకటకతో ప్రవేశిస్తూ, నవ్వుతూ అడిగాడు, "ఎప్పుడు మొదలు పెట్టావోయ్ మళ్ళీ యీ సంఘసేవ? మాతో మాటమాత్రమైనా చెప్ప లేదేం?"

నిరంజనరావు తేరుకొని, సుబ్బారావు అన్న మాటల అర్థం గమనించక అన్నాడు,

"దానికి మొదలూ, తుదీ ఏమిటి? ఎప్పుడూ ఉండేదే."

"అది సరేలే. కనీసం ప్రారంభోత్సవానికైనా మమ్మల్ని పిలవ కూడదా?"

"ప్రారంభోత్సవం ఏమిటి?"

"ఉత్సవం అంటే ఉత్సవమేనా? ఓపెన్ చేసేటప్పుడు నలుగురు స్నేహితుల్ని పిలిచి కాస్త కాఫీ పోయించి వాళ్ళ ఆశీర్వాదాలు పొందటం మంచిది కాదూ. సరేలే, వొస్తా. అయిపోయిన పెళ్ళికి మేళాలెందుకు? అర్జంటుగా అటు పోతూంటే నీ ప్రకటనలని చూసి సంగతి తెలుసుకుందామని వొచ్చా. వస్తా."

తనని మాట్లాడనియ్యకుండా ఒక్కదమ్ములో చెప్పేదంతా చెప్పి వెళ్ళిపోతున్న సుబ్బారావు వైపే చూసి, అతనన్నది నెమరుకు తెచ్చుకుని ఒక క్షణం ఆగి గది బయట కొచ్చి కళ్ళెత్తి చూశాడు గోడవైపు నిరంజనరావు. ఒక అర నిమిషందాకా అతనికి పరిస్థితి అర్థం కాలేదు. డాబామీద పిట్ట గోడకి ఆనుకుని పెద్ద బోర్డు "ఉచితము" అని రాసి ఉంది. దాని కింద మూడు బోర్డులు, కొంచెం చిన్నవి ఉన్నాయి. "ఇచ్చట పైంటు చెయ్యబడును, నేర్పబడును" అని ఒకటి, "దేశోద్ధారక రాత్రి పాఠశాల: ట్యూషన్లు చెప్పబడును" అని ఇంకోటి, "హోమియో వైద్యశాల: అన్ని విధములైన వ్యాధులు కుదర్చబడును" అని ఇంకోటి.

బోర్డులు చదివి నిరంజనరావు కోపఘూర్ణిత మానసుడయ్యాడు. అతనికి తీరని ఆశాభంగం కలిగింది. జరిగిన ఘటనల్ని జ్ఞాపకం చేసుకుని మండిపడ్డాడు. ఇదంతా ఆ స్టూడెంట్ చేసిన పనే. పాపంగదా, అని జాలి తలచి తక్కువ అద్దెకి తన రూమ్ ఇస్తే, మొన్న ప్రవేశించాడో లేదో, ఈ తుంటరి పనులు చేస్తాడా!

నిరంజనరావు భరించలేనంత కోపంతో గబగబ మేడమీది కెళ్ళాడు. దొంగతనం చేస్తున్న వ్యక్తిని తటాలున పట్టుకున్నట్టుగా అనిపించింది నిరంజనరావుకి. ఆ స్టూడెంటు నల్ల బోర్డుమీద ఏదో అక్షరాలు రాస్తున్నాడు.

"ఏమిటీ పని?"

హుటాహుటిగా వొచ్చి ఇలా అడుగుతున్న నిరంజనరావుని చూసి, ఆ విద్యార్థి అదిరిపోయి అడిగాడు "ఏమిటి?"

"ఇది మర్యాదస్తుల కొంప అని తెలీదా? బోర్డులుకట్టి పెద్దమనుష్యుల్ని అవమానం చెయ్యటమేనా నువ్వు నేర్చుకుంటున్న విద్య?"

విషయం బోధపడి. పశ్చాత్తాప పడ్డట్టుగా ముఖంపెట్టి అన్నాడా విద్యార్థి,

"క్షమించండి, పొరపాటు జరిగింది. నా ఉద్దేశం అదికాదు. బీదవాడిని కావటంవల్లా, పెయింట్ చెయ్యటం రావటంవల్లా, బోర్డులు రాసి డబ్బు సంపాదించుకుంటున్నాను. అర్జంటుగా ఇవ్వాలిసిన బోర్డులు త్వరగా ఎండుతాయని అలా అక్కడ పెట్టాను. మరోవిధంగా భావించకండి."

నిరంజనరావు వేడి చల్లారిపోయింది. అతను చెప్పేది చాలా న్యాయంగా, సకారణంగా కనిపించటంవల్ల ఏమీ అనలేక పోయాడు.

కాని ఇప్పుడతనికో కొత్త సమస్య పట్టుకుంది. అప్పుడే చాలా మందికి ఈ విషయం తెలిసిపోయింది. ఈ బోర్డులన్నీ తీసేసిన తరవాత నలుగురూ ఏమనుకుంటారు? ఇదో స్టంట్ అని తనని అవమానం చెయ్యరా. ఈ మూణ్ణాళ్ళ ముచ్చటకోసం బోర్డులు కూడా చెక్కించాడని నవ్వుకోరా! గొప్ప పొరపాటు జరిగిపోయింది. ఎలా ఇప్పుడు? ఆలోచించి గత్యంతరం లేక అన్నాడు.

"సరే, అయిందేదో అయింది. ఆ బోర్డులు ఇహ అక్కడినుంచి తియ్యకండి."

ఆ విద్యార్థి చిత్రకారుడు తెల్లబోయాడు.

"ఏం?"

"అవి నాకు కావాలి."

"అవి చాలా అర్జంటండీ. ఇవాళ తప్పక ఇస్తానని మాటిచ్చాను. లేకపోతే పరువు పోవటమే కాక ఇహ ఎవరూ ఆర్డర్లు ఇవ్వరు."

"తప్పనిసరి."

"క్షమించండి." జాలిగా అన్నాడతను.

"పోనీ, ఇంకా కొంచెం ఎక్కువగా డబ్బిస్తాను, ఇచ్చెయ్యండి. ఇది చాలా ముఖ్యం."

అతనేమీ అనలేకపోయాడు.

"తరవాత, ఇంకో బోర్డు కూడా త్వరగా రాసివ్వండి, "దేశోద్ధారక సేవా సదనం (వేసవిలో మాత్రమే పనిచేయును) అని. అర్జంటు."